క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నూజివీడు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్త్రీశక్తి సమావేశ భవనంలోని మీటింగ్‌హాల్‌లో సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యునితో పాటు సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

'కోపా' ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

విస్సన్నపేట: కోపా ట్రస్ట్ విస్సన్నపేట ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద కాపు విద్యార్థులకు ప్రోత్సహిక ఉపకార వేతనం అందజేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కోపా ట్రస్ట్ డైరెక్టర్, ట్రెజరర్ తుంగల నరేంద్ర గురువారం తెలిపారు. విస్సన్నపేట, తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, నూజివీడు, చాట్రాయి, మైలవరం, రెడ్డిగూడెం మండలాల పరిధిలో ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు చదువుతున్న కాపు విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98666 06304, 83673 26304 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉజ్వల పథకం గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



లక్ష్మీపురం(తిరువూరు): ఉజ్వల పథకం కింద మహిళలకు మంజూరైన ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లను మండలంలోని లక్ష్మీపురంలో గురువారం అందజేశారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై బీజేపీ జిల్లా కార్యదర్శి పోలే శాంతి వివరించారు. ఈవోపీఆర్డీ వెంకటరత్నం, గ్రామ సర్పంచ్ జి.శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అచ్యుతరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు, వృద్ధులకు వస్త్రాల అందజేత



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): సమాజంలో మానవ సేవే మాధవ సేవ అని గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి డైరెక్టర్ మోగులూరి ఎలీషా అన్నారు. కేతనకొండలోని చర్చి వద్ద దివ్యాంగులకు, వృద్ధులు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో నిస్సయతతో ఉన్న వారికి చేతనైన సహాయం చేయడమే మానవత్వం అన్నారు. భగవంతుడు తనకిచ్చిన దాంట్లో తోటి వారిని ఆదుకోవడమే దైవసేవగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సుమలత, పెద్దలు అబ్రహాం, యోహాన్, రవి, నాగరాజు, రాము పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు



ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మైలవరం నియోజకవర్గంలోని వివిధ మండలాల అంగన్‌వాడీ వర్కర్లు ఇబ్రహీంపట్నంలో మంత్రిని గురువారం కలిసి తమ సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి తమ కంటే అంగన్‌వాడీలకు ఎక్కువ తెలుసన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రూ.7 వేలుగా ఉన్న వేతనాలను రూ.11,500కు పెంచారని గుర్తు చేశారు. పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే విధుల్లో చేరాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ప్రదర్శన



ఆగిరిపల్లి: కనసానపల్లిలో బుధవారం రాత్రి భవానీ మాలాధారుల ఆధ్వర్యంలో జ్యోతుల ప్రదర్శనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ బాలా త్రిపుర సుందర సమేత చంద్రమౌళీశ్వర ఆలయం నుంచి దుగ్గిరాల బాల రావమ్మ ఆలయం వరకు భక్తులు జ్యోతుల ప్రదర్శన చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

- ఉత్సాహంగా పాల్గొంటున్న యువత
- పోటీలకు విశేష స్పందన

నూజివీడు: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ డబుల్స్ మహిళలు, పురుషులకు నిర్వహించారు. పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటుంది. గురువారం పోటీలు మూడు రోజుకు చేరుకున్నాయి. మండలంలోని మీర్జాపురం, పల్లెర్లమూడి, యనమదల, పడమర దిగవల్లి హైస్కూళ్లలోనూ, పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్, డీఏఆర్ కళాశాల, సెయింట్‌థామస్ హైస్కూల్ ఆవరణల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. సచివాలయ స్థాయి పోటీలు జనవరి 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పడమర దిగవల్లి హైస్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ వీక్షించారు. దిగవల్లి, అన్నవరం జట్ల మధ్య కబడ్డీ పోటీలను నిర్వహించగా అన్నవరం జట్టు విజయం సాధించింది. ప్రభుత్వ పాఠశాలల పీడీలు ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

యువతను ప్రోత్సహించడానికే...

ఆగిరిపల్లి: యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నారని స్పెషలాఫీసర్ సత్యనారాయణరాజు తెలిపారు. నెక్కలం గొల్లగూడెం సచివాలయ పరిధిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను గురువారం ఆయన పర్యవేక్షించారు. ఆగిరిపల్లి, ఈదర, ఈదుల గూడెం, అడవినెక్కలంలోని క్రీడా ప్రాంగణంలో క్రీడా పోటీలు నిర్వహించామని, షెడ్యూల్ ప్రకారం సురవరంలో శుక్రవారం పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీఓ శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లింగవరపు రమేష్, వేము రాజు, ఈవోపీఆర్డీ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు సంగమయ్య, పుల్లారావు పాల్గొన్నారు.

ఉత్కంఠగా వాలీబాల్ పోటీలు

గంపలగూడెం: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా గంపలగూడెం మండలంలోని 21 సచివాలయాల్లో నిర్వహించిన వాలీబాల్ పోటీ ఉత్కంఠగా సాగింది. పెద్దకొమిర సచివాలయం పరిధిలోని మోడల్ స్కూల్‌లో పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా అమలు జరగని విధంగా రాష్ట్రంలో మెగా ఆటల క్రీడల పోటీ నిర్వహిస్తోందన్నారు. వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు మండలంలో 40 టీమ్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయని ఎంఈఓ నరసింహారావు, తిరువూరు నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త గుర్రం గోపాలరావు తెలిపారు. వీటిలో 37 పురుష టీమ్‌లు, మూడు మహిళా టీమ్‌లు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో పోటీలను యువత ఆసక్తిగా తిలకించింది.

ఖోఖో ఆటల పోటీల్లో 36 టీమ్‌లు

విస్సన్నపేట: మండలంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఖోఖో ఆటల పోటీలను గురువారం నిర్వహించారు. 36 టీమ్‌లు పాల్గొన్నాయని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొని పోటీలను వీక్షించారు.

వాలీబాల్ పోటీలకు 27 జట్లు

తిరువూరు: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా గురువారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. 24 పురుషుల జట్లు, 3 మహిళా జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. మునుకుళ్ల, కోకిలంపాడు, మల్లేల, ముష్టికుంట్ల, లక్ష్మీపురం, కాకర్ల, చౌటపల్లి, గానుగపాడు, రోలుపడి సచివాలయాల పరిధిలో జరిగిన ఆటల పోటీలను ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటరత్నం, తిరువూరు పట్టణంలో నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ పర్యవేక్షించారు. శుక్రవారం ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు.



పడమర దిగవల్లిలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



విస్సన్నపేటలో ఖో ఖో ఆడుతున్న క్రీడాకారిణులు

ప్రతిభను వెలికితీసేందుకే..



కబడ్డీ క్రీడాకారులతో ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ మండల అరుణ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సురేష్

క్రీడాకారులకు ప్రోత్సాహం..

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో ఎంతో మంది ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొనటం అభినందనీయమని గొల్లపూడి పంచాయతీ వైస్ ఎంపీపీ వేమూరి సురేష్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గొల్లపూడిలోని ఇండోర్ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. గొల్లపూడి సచివాలయం-1, 2 పరిధుల్లోని యువకులు ఈ పోటీల్లో పాల్గొనగా సురేష్ వారిని పరిచయం చేసుకుని ఉత్సాహపరిచారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలుగచేసే క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాలని కోరారు. ఈవోపీఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, పంచాయతీ ఈఓ స్వరూపరాణి, నాయకులు గేరా సుమన్ పాల్గొన్నారు.

చాట్రాయిలో పోటీలు

చాట్రాయి: మండలంలోని చనుబండ, చిత్తపూరు, చిన్నంపేట, మర్లపాలెం సచివాలయాల పరిధిలో గురువారం ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు హోరాహోరీగా సాగాయి. క్రీడాకారులు ప్రదర్శిస్తున్న ఆట తీరు, నైపుణ్యం, స్ఫూర్తి క్రీడాభిమానులకు చక్కని వినోదాన్ని పంచుతుండడంతో సందడి వాతావరణం నెలకొంది. వృద్ధులు సైతం క్రీడ పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.



అడవినెక్కలంలో పోటీలను ప్రారంభిస్తున్న స్పెషలాఫీసర్ సత్యనారాయణ రాజు



తిరువూరులో వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ



గంపలగూడెంలో వాలీబాల్ పోటీ



మర్లపాలెంలో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

అయోధ్య అక్షింతలకు ఘన స్వాగతం



ముసునూరు: మండల కేంద్రం ముసునూరుకు చేరుకున్న అయోధ్య రామయ్య అక్షింతలకు మండల ప్రజలు, భక్తులు ఘన స్వాగతం పలికారు. స్థానిక వెంకటాచల స్వామి దేవస్థానం వద్దకు అయోధ్య రామాలయం నుంచి గురువారం వచ్చిన అక్షింతలను సమరసతా ఫౌండేషన్ ప్రచారక్ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులు తలపై ఉంచి, ఇతర గ్రామాలకు అందించే మహత్తర కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ మల్లవల్లి కోటేశ్వరరావు, మహిళా కన్వీనర్ లక్ష్మి మండలంలోని 16 గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

టీడీపీలో మరోసారి బయటపడిన వర్గవిభేదాలు



ఇబ్రహీంపట్నం: మైలవరం నియోజకవర్గం టీడీపీలో వర్గవిభేదాలు మరోసారి బయటపడ్డాయి. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావును బలపరుస్తూ మాజీ మంత్రి దేవినేని ఉమాకు వ్యతిరేంగా ఇబ్రహీంపట్నంలో ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. గొల్లపూడిలో జనవరి 5న బొమ్మసాని తన బలం నిరూపించేందుకు ఏర్పాటు చేసిన బహిరంగ సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. దేవినేని ఉమాకు తమ మద్దతు ఉండదని పరోక్షంగా చెప్పారు. ఇప్పటికే ఓ వైపు మాజీ మంత్రి దేవినేని ఉమా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్(అన్నా), బొమ్మసాని సుబ్బారావు తలోదారిలో పర్యటిస్తూ ఎవరికి వారు ఎమ్మెల్యే సీటు నాదే అంటూ ప్రచారం చేస్తున్నారు. ఈ పరిణామాలతో గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు వర్గాలుగా విడిపోయారు. ప్రస్తుతం టీడీపీ పరిస్థితి మూడు ముక్కలాటగా మారింది. ఇప్పటి వరకు టీడీపీలో అసమ్మతి వర్గంగా మారి పోటీ కార్యక్రమాలు చేసిన బొమ్మసాని సుబ్బారావు ఒకడుగు ముందుకేసి జనవరి 5న టీడీపీలో తన బలం నిరూపణకు సిద్ధమైయ్యారు. రోజు రోజుకు మారుతున్న పరిణామాలతో ఆ పార్టీ కార్యకర్తలు డైలమాలో ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



జి.కొండూరులో మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ జక్రధరరావు

జి.కొండూరు: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించేందుకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అందించిన స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను గురువారం విద్యార్థులకు అందజేశారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అందించారు. నాయకులు మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.

జెడ్పీ హైస్కూల్‌లో..

ఏ.కొండూరు: మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లా చైర్‌పర్సన్ ఉప్పల హారిక సౌజన్యంతో అందించిన మెటీరియల్‌ను విద్యార్థులందరికీ అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోటా పుల్లారావు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, మాజీ సర్పంచ్ దాసరి సతీష్, ఎంఈఓ ఈ.కేశవరావు, హెచ్ఎం ఆదిశేషు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



ఏ.కొండూరులో మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు



తిరువూరులో మెటీరియల్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

తిరువూరు జెడ్పీలో పంపిణీ

తిరువూరు: స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అత్యధిక మార్కుల సాధనకు స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ ఏరువ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు వినయ్ పాల్గొన్నారు.

వైద్య సేవలు సమర్థవంతంగా అందించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో నిర్వహిస్తున్న కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సేవలను సమర్థవంతంగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె గురువారం జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గడ్డమణుగు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కుటుంబ డాక్టర్ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ లాంటి వ్యాధులతో బాధపడే వారు కుటుంబ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆ కేంద్రంలో అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. మందులు కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఇండెంట్ పెట్టి తీసుకోవాలని సూచించారు. ఎంటఏపీ హెల్త్ యాప్ నిర్వహణ, ఏఎన్ఎంలు నిర్వహించే ఆర్‌సీహెచ్ సేవలు నమోదు, వివిధ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఇ-సంజీవనీ కాల్‌లు, అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలో ఆశ కార్యకర్తలు నిర్వహిస్తున్న లెప్రసీ రోగులను గుర్తించే కార్యక్రమం ఎల్‌సీడీసీ సర్వేను డాక్టర్ సుహాసిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన డాక్టర్ సుహాసిని ప్రజల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జి.కొండూరు వైద్యాధికారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ డాక్టర్ కార్యక్రమాన్ని వివరిస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం)/మైలవరం: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మైలవరం నియోజకవర్గంలో నిర్వహించిన వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ పాల్గొని పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ వంటి ఎందరో త్యాగధనులు కాంగ్రెస్ పార్టీ తరపున దేశం కోసం ఎన్నో త్యాగాలను చేస్తూ వారి జీవితాలను అంకితం చేశారన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ ఉపాధ్యక్షుడు శీలం రామకృష్ణ, డీసీసీ కార్యదర్శులు చింతపల్లి దాసు, మసనం సుధాకరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏ.దుర్గారావు, నాయకులు దోసపాటి గిరి, పిట్టల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేవంత్‌ను విమర్శించే స్థాయి మందకృష్ణకు లేదు

మైలవరం: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మంద కృష్ణ మాదిగకు లేదని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు. మైలవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి చాపలమడుగు కాంతారావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సమస్యపై అఖిల పక్షాన్ని మోదీ వద్దకు పంపాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేసే నైతిక హక్కు మందాకు లేదన్నారు. ఆంధ్ర మాదిగలను మేల్కొల్పేందుకు జనవరి 31న మాదిగ, రెల్లి, డక్కలి ఉప కులాల యుద్ధభేరీ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముసునూరు: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.రాణి కోరారు. రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో నోడల్ అధికారి దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన సర్పంచ్‌లు రంగు ధనలక్ష్మి గాంధీ, పులిబళ్ల లక్ష్మి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న పథకాలను సమగ్రంగా వివరించారు. వ్యవసాయాధికారి మధుమోహన్, వైద్యాధికారి కరీముల్లా పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని, ఉప సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ పుచ్చకాయల వెంకటేశ్వరరావు, తహసీల్దార్ దాసరి సుధ, ఎంఈఓ బీవీ సుబ్బారావు, బీజేపీ నాయకుడు ఆముదాల ఇస్సాకు, ఉపాధి హామీ ఈసీ జయప్రసాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి వ్యూహాల అమలుతో లక్ష్యాల సాధన

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం(ఏబీపీ) కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన జిల్లాలోని ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో అభివృద్ధి వ్యూహాలను సమర్థవంతంగా అమలుచేయడం ద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులతో పేర్కొన్నారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల మూడో జాతీయ సదస్సులో ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకులపై గురువారం ప్రత్యేక సెషన్ జరిగింది. భారత ప్రధానమంత్రి హాజరైన ఈ సెషన్‌కు ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకులకు సంబంధించిన అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, వివిధ శాఖల అధికారులు కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి, అమలుచేసిన ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం (ఏడీపీ) మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. మన జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు ఎంపికయ్యాయని తెలిపారు. ఈ మండలాల్లో పాలనా కార్యకలాపాలను మెరుగుపరచి, అన్ని విధాలా సమగ్రంగా అభివృద్ధి చేసి.. ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల పటిష్ట అమలు, అధికారుల మధ్య సమన్వయం, పోటీతత్వ స్ఫూర్తి తదితరాలతో ఈ మండలాల సామాజిక, ఆర్థిక సూచికల్లో ప్రగతికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అయిదు కేటగిరీలకు సంబంధించి ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, అనుబంధ రంగాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రాథమిక మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమ్మిళిత రంగాల్లో మొత్తం 40 సూచికల్లో ప్రగతిని నీతి ఆయోగ్ ఎప్పటికప్పుడు మదింపు చేస్తుందని వెల్లడించారు. అందుబాటులో ఉన్న సామాజిక, ఆర్థిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ సూచికల్లో ప్రగతిని కనబరచవచ్చని వివరించారు. ఇందుకు విద్య, వైద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయం తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీపీఓ వై.శ్రీలత, ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ బీవీ రామకృష్ణ నాయక్, పెనుగంచిప్రోలు ఎంపీడీఓ హర్షసాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు